క్లుప్తంగా

గుడిపాడులో ఇంటింటి ప్రచారం

గూడూరు రూరల్: మండల పరిధిలోని గుడిపాడులో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిమూలపు సతీష్‌కు మద్దతుగా ఆదివారం ఆ పార్టీ స్థానిక నాయకులు స్వామిదేవి, సురేష్, ప్రసాద్, ప్రకాష్, కిషోర్, హరి, సుగుణ ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 58 నెలల పాలనలో పేదలకు అందించిన సంక్షేమ పథకాలు, రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి గురించి ప్రజలకు వివరించారు. మరింత మేలు జరిగేందుకు వైఎస్సార్‌సీపీని గెలిపించాలని కోరారు. ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు బీవై రామయ్య, సతీష్‌కు ఓటు వేయాలని అభ్యర్థించారు.

నందీశ్వరుడికి ప్రదోషకాల అభిషేకం



నందీశ్వరుడికి అభిషేకం చేస్తున్న పండితులు

మహానంది: మహానందిలో కొలువైన మహానందీశ్వరస్వామి గర్భాలయం ఎదురుగా ఉన్న నందీశ్వరుడికి ఆదివారం, బహుళ త్రయోదశి పురస్కరించుకుని ప్రదోష కాలంలో సాయంత్రం ప్రదోషకాల అభిషేకం వైభవంగా నిర్వహించారు. ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, ప్రధాన అర్చకులు మామిళ్లపల్లి అర్జునశర్మ, పండితులు ముందుగా గణపతి పూజ, కలశపూజ, నందీశ్వర ఆహ్వానం, పీఠార్చన పూజలు చేశారు.

ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలి



హరి నామ సంకీర్తన చేస్తున్న ఇస్కాన్ సభ్యులు

కర్నూలు కల్చరల్: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలని ఇస్కాన్ బాధ్యులు రఘునందన సేవక్ ప్రభు సూచించారు. స్థానిక భగీరథ కాంప్లెక్స్‌లోని పూరి జగన్నాథ మందిరంలో ఆదివారం భగవద్గీత శిక్షణ తరగతులు, శీల ప్రభుపాదుల ప్రేమ విందు కార్యక్రమాలు జరిగాయి. జగన్నాథ్, బలదేవ్, సుభద్ర మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భగవద్గీత పఠనం, శ్రవణం ఉత్తమ జీవితానికి మార్గం చూపుతుందన్నారు. సమయం సద్వినియోగం చేసుకుంటూ దేవాలయాలు, ఆధ్యాత్మిక కేంద్రాలను సందర్శించాలన్నారు. ప్రవచన కర్తల సందేశాన్ని విని ఆచరించాలన్నారు. హరే రామ హరే కృష్ణ జప యజ్ఞాన్ని చేయించి హరినామ సంకీర్తనలు ఆలపించారు. అనంతరం జగన్నాథ్, బలదేవ్, సుభద్రలకు రాజ భోగ నివేదన చేసి అన్న ప్రసాదాన్ని వితరణ చేశారు.

వడ దెబ్బతో శరీర వ్యవస్థ దెబ్బతింటుంది



ఓఆర్ఎస్ ద్రావణంపై అవగాహన కల్పిస్తున్న డీఎంహెచ్ఓ ప్రవీణ్‌కుమార్

కర్నూలు(హాస్పిటల్): వడదెబ్బ కారణంగా మనిషి శరీర ఉష్ణోగ్రత నియంత్రించే వ్యవస్థ దెబ్బతింటుందని డీఎంహెచ్ఓ డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ చెప్పారు. ఆదివారం ఆయన బస్టాండ్‌ను సందర్శించి ప్రయాణికులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. జిల్లాలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతో బయటకు వెళ్లేటప్పుడు ఎండ దెబ్బ తగలకుండా గొడుగులు, టవల్, రుమాలు తప్పనిసరిగా వాడాలన్నారు. అత్యవసరమైతేనే బయటకు రావాలని, గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, చిన్నపిల్లలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చెవిలోకి వేడి గాలి వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తల వద్ద, అంగన్‌వాడీ కేంద్రాల్లో, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. వడదెబ్బకు గురైన వారికి అత్యవసర వైద్యచికిత్స అందించాలని, లేకపోతే ప్రాణాలకే ముప్పు ఏర్పడుతుందన్నారు. వడదెబ్బకు గురైన వారిని మొదట చల్లని నీటితో కానీ, నీటిలో ముంచిన వస్త్రంతో కానీ శరీరం మొత్తం మర్దన చేయాలన్నారు. ఉప్పు కలిపిన నీరు, మజ్జిగ, నిమ్మరసం, ఓఆర్ఎస్ తాగించాలని సూచించారు. ఇవన్నీ చేస్తూనే 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చి దగ్గరలోని ఆసుపత్రికి తీసుకెళ్లి సరైన వైద్య చికిత్స అందేలా చూడాలన్నారు.

హాస్యంతో మానసిక ఆనందం

కర్నూలు(హాస్పిటల్): హాస్యంతో మానసిక ఆనందం లభిస్తుందని ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ బి.శంకరశర్మ చెప్పారు. కర్నూలు హార్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఎ.క్యాంపులోని హెల్త్‌క్లబ్‌లో వరల్డ్ లాఫింగ్ డే నిర్వహించారు. నవ్వు వల్ల ఉపయోగాల గురించి లాఫింగ్ స్పెషలిస్టు సలీంబాషా వివరించారు.

రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటాం

- పరిశ్రమలకు భూములిచ్చిన ప్రతి రైతుకూ న్యాయం చేశాం
- సంతృప్తి చెందేలా పరిహారం అందించాం
- కందికాయపల్లె, పిన్నాపురం గ్రామాల్లో సోలార్ పరిశ్రమ ఏర్పాటుతో స్థానికులకు ఉపాధి అవకాశాలు
- తమ్మరాజుపల్లెలో చెక్‌డ్యామ్ నిర్మించి తీరుతాం
- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కాటసాని రాంభూపాల్‌రెడ్డి



ఎన్నికల ప్రచారంలో ఎంపీ, ఎమ్మెల్యేలు పోచా బ్రహ్మానందరెడ్డి, కాటసాని రాంభూపాల్‌రెడ్డి

పాణ్యం: పరిశ్రమల ఏర్పాటుతో భూములు కోల్పోయిన రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటున్నామని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని కందికాయపల్లె, తమ్మరాజుపల్లె, పిన్నాపురం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యేకు పార్టీ నాయకులు, గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. క్రేన్‌తో గజమాల వేసి అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా కాటసాని మాట్లాడుతూ.. పిన్నాపురం గ్రామంలో సోలార్, హైడల్ ప్రాజెక్టు ఏర్పాటుతో స్థానికులకు ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని తెలిపారు. భూములు ఇచ్చిన ప్రతి రైతుకు సంతృప్తి చెందేలా పరిహారం అందిస్తున్నామని చెప్పారు. గత పాలకుల వల్ల రైతులు నష్టపోయారన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సమస్యలను పరిష్కరించినట్లు తెలిపారు. అలాగే కందికాయపల్లె గ్రామంలో సోలార్ విండ్ పరిశ్రమ రాకతో స్థానికులకు ఉపాధి దొరికిందన్నారు. కందికాయపల్లె గ్రామానికి రూ. 60 లక్షలతో రామతీర్థం నుంచి తాగునీటిని తీసుకొచ్చినట్లు చెప్పారు. ప్రజలకు మరింత సేవ చేసేందుకు తనను గెలిపించాలని కోరారు.

చెక్‌డ్యామ్ నిర్మించి తీరుతాం



గడ్డంపేటలో పూలవర్షం కురిపిస్తున్న అభిమానులు

తమ్మరాజుపల్లె జీవనాడి అయిన ఏటిపాయ చెక్‌డ్యామ్‌ను నిర్మించి తీరుతామని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి స్పష్టం చేశారు. ఇప్పటికే మైనర్ ఇరిగేషన్ ద్వారా రూ.3 కోట్లకు ప్రతిపాదనలు పంపామని తెలిపారు. గ్రీన్‌కో సహకారంతో ప్రాజెక్టు నిర్మించి ప్రజల ఆకాంక్ష నెరవేరుస్తామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు సద్దల సరళమ్మ, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సద్దల సూర్యనారాయణరెడ్డి, ఎంపీపీ ఉసేన్‌బీ, సర్పంచ్‌లు రామతీర్థం రామచంద్రుడు, విజయ గౌరి, ఎల్లకృష్ణయ్య, ఎంపీటీసీ సభ్యులు రమణయ్య, వెంకటేశ్వర్లు, నాయకులు దస్తగిరి, నారాయణ, బాలిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతిపక్షాలవి దిగజారుడు రాజకీయాలు

రాష్ట్రంలో అభివృద్ధిని చూసి ఓర్వలేని టీడీపీ నేతలు తమ ప్రభుత్వంపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. వారికి తోడు పచ్చ పత్రికలు కూడా తమ్మరాజుపల్లె మైనింగ్‌పై తప్పుడు రాతలు రాయడం సిగ్గుచేటన్నారు. కొన్నేళ్లుగా ఆ గ్రామస్తులు మైనింగ్‌పై ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు. కొత్తగా సీఎం జగన్ వచ్చాక మైనింగ్ పనులు జరగడం లేదన్నారు. అక్రమ మైనింగ్ అంటూ బురదజల్లే ప్రయత్నం చేయడం మంచి పద్ధతి కాదన్నారు. ప్రతిపక్షాల నీతిమాలిన ఆరోపణలు చేయడం మానుకోవాలని హితవుపలికారు. ప్రజలు గత ఎన్నికల్లో బుద్ధి చెప్పినా వారిలో మార్పు రాలేదన్నారు.

వైఎస్సార్‌సీపీ పాలనలో పాణ్యంలో గణనీయ అభివృద్ధి

- డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేశాం
- ముస్లింలకు మినీ షాదీఖానా
- రూ.2.50 కోట్లతో సీసీరోడ్లు, కాలువలు నిర్మించాం
- టీడీపీ నాయకులు కళ్లుండి చూడలేకపోతున్నారు
- పోచా బ్రహ్మానందరెడ్డి, కాటసాని రాంభూపాల్‌రెడ్డి



ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

పాణ్యం: వైఎస్సార్‌సీపీ ఐదేళ్ల పాలనలో పాణ్యం నియోజకవర్గంలో గణనీయ అభివృద్ధి జరిగిందని వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు పోచా బ్రహ్మానందరెడ్డి, కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం పాణ్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పాణ్యం ఎన్నడూ లేని అభివృద్ధి జరిగిందన్నారు. రూ. 2.50కోట్లతో సీసీరోడ్లు, డ్రైనేజీ కాలువలు నిర్మించామని తెలిపారు. రోడ్డు విస్తరణ పనులు చేశామన్నారు. విద్యార్థులకు ఉన్నత విద్య అందాలనే ఉద్దేశంతో సీఎం దృష్టికి తీసుకెళ్లి డిగ్రీ కళాశాలను మంజూరు చేయించామని తెలిపారు. అలాగే ముస్లింలకు రూ.10 లక్షలతో మినీ షాదిఖానా నిర్మిస్తున్నామని చెప్పారు. రజకులు విజ్ఞప్తి మేరకు కమ్యూనిటీ హాల్‌కు స్థలాన్ని కేటాయించి నిర్మాణానికి సహకరిస్తున్నట్లు తెలిపారు. పాణ్యం ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు సీహెచ్‌సీలో వైద్యులు, సిబ్బంది, అధునాతన యంత్రాలు, సామగ్రి అందుబాటులోకి తెచ్చామన్నారు. పట్టణంలో నాలుగు గ్రామ సచివాలయాలతో పాటు ఆర్‌బీకే, హెల్త్ సెంటర్లు నిర్మించామని తెలిపారు. కేవలం పాణ్యంలోనే సుమారు 500పైగా ఇంటి స్థలాలు ఇచ్చి సొంతింటి కలను సాకారం చేశామన్నారు. ఈవన్నీ ఐదేళ్లలోనే సాధ్యమైందన్నారు. టీడీపీ నాయకులు తమ హయాంలో ఏం అభివృద్ధి చేశారో చెప్పాలని ప్రశ్నించారు. వైఎస్ రాజశేఖర రెడ్డి ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్లు కల్పించారని గుర్తు చేశారు. వైఎస్సార్‌సీపీతోనే ముస్లింల సంక్షేమం సాధ్యమన్నారు.

రైతుల నీటి కష్టాలను పరిష్కరించాం

టీడీపీ పాలనలో సాగునీటి కోసం రైతులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. నీటి కోసం ధర్నాలు చేయాల్సిన పరిస్థితి కల్పించారన్నారు. తమ ప్రభుత్వ హయాంలో నీటి సమస్యలకు పరిష్కారం చూపామన్నారు. రైతులు సంతోషంగా ఉన్నారన్నారు. ఈ సంతోషం ఇలాగే ఉండాలంటే మరోసారి వైఎస్సార్‌సీపీని గెలిపించాలని కోరారు. వైస్ ఎంపీపీ వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ సభ్యురాలు నారాయణమ్మ, కో–ఆప్షన్ సభ్యులు జాకీర్‌ఉసేన్, కరుణాకర్‌రెడ్డి, పీవీ బద్రీనాథ్‌రావు, సుబ్బరాయుడు, బొజ్జన్న, టైలర్‌బాషా, ఎల్లగౌడ్, ఆటోమాబు, ఓబులేసు, సుబ్రమణ్యం, బాబు, రాజన్న పాల్గొన్నారు.

బెల్లం ఊట ధ్వంసం

చాగలమర్రి: చెంచుగూడెం సమీపంలోని అటవీ ప్రాంతంలో రెండు డ్రమ్ముల బెల్లం ఊట, నాటుసారా ధ్వంసం చేశామని డి.వనిపెంట సెక్షన్ అధికారి శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ రుద్రవరం రేంజి నాగార్జునసాగర్ టైగర్ రిజర్వు ఫారెస్ట్ పరిధిలో ఉన్నందున వన్యప్రాణుల సంరక్షణకు ప్రభుత్వ ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. ఎవరైన నిప్పు పెట్టిన, వన్య ప్రాణులను వేటాడిన, వృక్షాలను నరికినా కఠిన చర్యలు తప్పవన్నారు. బీట్ అధికారి సుభాష్, ప్రొటెక్షన్ వాచర్లు, హనుమంతు, రాముడు, నరసింహ ఉన్నారు.

'కాశీ క్షేత్రం' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

కర్నూలు కల్చరల్: ప్రముఖ కవి ఎల్లాల యతిరాజం మీనా నాగేశ్వరరావు రచించిన 'కాశీ క్షేత్రం' పుస్తకావిష్కరణ కార్యక్రమం ఆదివారం ఆవోపా సదన్‌లో జరిగింది. సీతారాముల కల్యాణ మహోత్సవ సమితి సౌజన్యంతో విశ్రాంత తహసీల్దార్ కె.క్రిష్టన్న అధ్యక్షతన కార్యక్రమం జరిగింది. విశ్రాంత స్పెషల్ కలెక్టర్ రామస్వామి, రవీంద్ర విద్యా సంస్థల అధినేత జి.పుల్లయ్య, ఆవోపా అధ్యక్షులు మేడా వెంకట సురేష్, ఏపీ టూరిజం డివిజనల్ మేనేజర్ చంద్రమౌళి రెడ్డి పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో సమితి గౌరవాధ్యక్షులు డాక్టర్ మోక్షేశ్వరుడు, కవులు వీపూరి వెంకటేశ్వర్లు, బోలుగద్దె అనిల్ కుమార్, సమితి సభ్యులు మహాబలేష్, మురళీ కృష్ణ, నాగోజీరావు, దామోదర్‌రెడ్డి, ఎస్వీ నారాయణరెడ్డి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పాలనను మళ్లీ తెచ్చుకుందాం



తిరుమలగిరిలో ప్రచారం చేస్తున్న కాటసాని శివనరసింహారెడ్డి

కల్లూరు: ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి మరోసారి సంక్షేమ పాలనను తెచ్చుకుందామని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి తనయుడు కాటసాని శివనరసింహారెడ్డి ప్రజలను కోరారు. ఆదివారం కల్లూరు అర్బన్ 28వ వార్డు పరిధిలోని తిరుమలగిరి, దొడ్డిపాడు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టోను వివరించారు. ఈ నెల 13న తేదీ జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసి ఎమ్మెల్యేగా కాటసాని రాంభూపాల్‌రెడ్డిని, ఎంపీగా పోచా బ్రహ్మానందరెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ ఐదేళ్లలో ప్రతి గడపకు లబ్ధి చేకూరిందన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మరోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని చేసుకుందామన్నారు. చంద్రబాబు హామీలను నమ్మి మోసపోవద్దన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ నారాయణరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు మునిస్వామి, నాయకులు ఫకృద్దీన్, సత్యంరెడ్డి, హనుమంతురెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, మన్సూర్ అలీ, షుకూర్ తదితరులు పాల్గొన్నారు.

జాతర సందడి



నోరూరించే మిఠాయి దుకాణం



విక్రయాలకు ఉంచిన ఎద్దుల బండ్లు



కడ్డీ మాంసం

పట్టణంలో తిమ్మగురుడుస్వామి జాతర సందర్భంగా ఆదివారం సందడి నెలకొంది. ఎద్దుల బండ్లు, వ్యవసాయ పరికరాలను జాతరలో అమ్మకానికి ఉంచారు. వ్యవసాయ ఉత్పత్తులు, పరికరాల క్రయ విక్రయదారులతో కిటకిటలాడింది. చిన్నపిల్లలు ఆట వస్తువులు, బొమ్మలు కొనుగోలు చేశారు. గాజులు, కుంకుమ దుకాణాల వద్ద మహిళల తాకిడి కనిపించింది. ఇక గూడూరు జాతర అంటే గుర్తుకొచ్చేది కడ్డీ మాంసం. అధిక శాతం జనం కేవలం కడ్డీ మాంసం రుచి చూసేందుకే ఇక్కడికి వస్తుంటారు.

– గూడూరు



గాజుల అంగళ్లు



కుంకుమ అంగడి



వ్యవసాయ పరికరాలు



ఉయ్యాల...జంపాల



వైఎస్సార్‌సీపీ ప్రచారానికి భారీగా తరలివచ్చిన పార్టీ నాయకులు, గ్రామస్తులు

విష్ణు అడ్డాలో వైఎస్సార్‌సీపీ ప్రచార హోరు

- సమస్యలు విన్నవించిన పలు గ్రామాల ప్రజలు
- గెలిచిన వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన నేతలు



సుంకేసులలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ఆదిమూలపు సతీష్, పక్కన కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి

కర్నూలు సిటీ: తెలుగుదేశం పార్టీ నాయకులు, మాజీ ఎంపీపీ డి.విష్ణువర్ధన్‌రెడ్డి అడ్డాలో వైఎస్సార్‌సీపీ ప్రచారం జోరుగా సాగుతోంది. అతని వల్ల అణిచివేతకు గురైన కర్నూలు రూరల్ మండల పరిధిలోని తొలిశాపురం, సుంకేసుల, ఆర్.కె దుద్యాల, ఎదురూరు, ఆర్.కొంతలపాడు గ్రామాల్లో ఆదివారం కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డితో కలిసి వైఎస్సార్‌సీపీ కోడుమూరు అసెంబ్లీ అభ్యర్థి డాక్టర్ ఆదిమూలపు సతీష్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఎన్నికల ప్రచారానికి వెళ్లకూడదని హుకుం జారీ చేసినా పెద్ద ఎత్తున అన్ని వర్గాల ప్రజలు హాజరై తమ సమస్యలు విన్నవించుకున్నారు. ప్రజలనుద్దేశించి సతీష్, హర్షవర్ధన్‌రెడ్డి మాట్లాడారు. గెలిచిన వెంటనే గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఎలాంటి సమస్య వచ్చిన పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఎవరికీ భయపడకుండా స్వేచ్ఛగా జీవించే వాతావరణం కల్పిస్తామన్నారు. ఇకపై అభివృద్ధి నిరోధకుల ఆటలు సాగనిచ్చేది లేదన్నారు. ప్రజల మధ్య చిచ్చు పెట్టి చలి కాచుకునే నాయకులు కావాలో? ప్రశాంత వాతావరణం కల్పించే నాయకులు కావాలో ఆలోచించి ఓటేయాలని కోరారు.

వరద ముంపు కాలనీలోని భూముల పరిశీలన

తుంగభద్ర నదికి 2009లో వచ్చిన వరద నీటి ముంపుతో సుంకేసుల గ్రామంలో ప్రజలకు ఇళ్ల పట్టాలు ఇవ్వకుండా అడ్డుకుంటున్నారని కొందరు ఫిర్యాదు చేయడంతో సతీష్, హర్షవర్ధన్‌రెడ్డి వరద ముంపు కాలనీకి వెళ్లి భూములను పరిశీలించారు. వైఎస్సార్‌సీపీ నాయకులను గెలిపిస్తే కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ ఇళ్ల పట్టాలు ఇస్తామని హామీ ఇచ్చారు. ఎన్నికల తర్వాత ఆర్.కె దుద్యాలకు రోడ్డు వేయిస్తామని, డ్రైనేజీలు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఎదురూరు, ఆర్.కొంతలపాడు గ్రామాల్లో మౌలిక సదుపాయాలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తామని సతీష్ వివరించారు. ప్రచారంలో జెడ్పీటీసీ సభ్యుడు ప్రసన్నకుమార్, పార్టీ రైతు విభాగం జిల్లా కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, వైస్ ఎంపీపీ నెహిమియా, మాజీ ఎంపీపీ డి.వాసు, సింగిల్ విండో చైర్మన్లు అమర్నాథ్‌రెడ్డి, శేషిరెడ్డి, వంశీకృష్ణారెడ్డి, ఎంపీటీసీ సభ్యులు హనుమంతు, రాంనాథ్‌రెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు చిన్నలక్ష్మన్న, బి.తాండ్రపాడు శేఖర్, మోహన్‌బాబు, కురువ మధు, హనుక్, వీరారెడ్డి, ఎదురూరు వెంకటేశ్వర్లు, సయ్యద్, శివ శంకర్ నాయుడు, ఎస్సీ సెల్ కార్యదర్శి ప్రసాద్, నాయకులు బి.వెంకటేష్, అబాన్‌బాషా, గొందిపర్ల గోపాల్, పంచలింగాల వెంకటేశ్వర్‌రెడ్డి, అబ్రహాం, సామేలు, సునీల్ రంగన్న, బొజ్జన్న, కేశవరెడ్డి, ప్రభుదాస్, మద్దిలేటి, భాస్కర్, పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి కొండపేట యువకులు



కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్ష, ఎమ్మెల్యే అభ్యర్థి సతీష్ సమక్షంలో పార్టీలో చేరిన యువకులు

కోడుమూరు రూరల్: కోడుమూరు కొండపేటకు చెందిన నందు, ప్రకాష్, క్రాంతి, వినయ్, రాజేష్, గణేష్ సహా 30 మంది యువకులు వైఎస్సార్‌సీపీలో చేరారు. ఆదివారం కర్నూలులో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిమూలపు సతీష్, కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి వారికి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, పాలనకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నట్లు యువకులు తెలిపారు. సతీష్ గెలుపునకు కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు రఘునాథ్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్1 ప్రవీణ్‌కుమార్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రమేష్‌నాయుడు, అద్దుగల కల్యాణ్ రామిరెడ్డి పాల్గొన్నారు.

గుమ్మనూరు జయరాం తండ్రి బెదిరింపులు

- చిప్పగిరి కో–ఆప్షన్ సభ్యుడు సర్వర్‌ఖాన్‌కు ఫోన్‌లో బెదిరింపులు
- విరూపాక్షి తరఫున ప్రచారం చేస్తున్నందునే అక్కసు



ఆలూరులో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సర్వర్‌ఖాన్

ఆలూరు: మాజీ మంత్రి గుమ్మనూరు జయరాం తండ్రి గుమ్మనూరు బసప్ప ఫోన్ చేసి కులం పేరుతో దూషిస్తూ బెదిరింపులకు పాల్పడుతున్నాడని చిప్పగిరి మండలం వైఎస్సార్‌సీపీ కో–ఆప్షన్ మెంబర్ సర్వర్‌ఖాన్ తెలిపారు. స్థానిక ఎల్లార్తి రోడ్డు సమీపంలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గుమ్మనూరు జయరాం కుటుంబ సభ్యులు వైఎస్సార్‌సీపీలో కొనసాగినప్పుడు తాము ఆయన గెలుపు కోసం పనిచేశామన్నారు. ప్రస్తుతం ఆయన పార్టీ మారడంతో విరూపాక్షిని జగనన్న అభ్యర్థిగా నిలిబెట్టారని, ఆయన గెలుపుకోసం విస్తృతంగా ప్రచారం చేస్తుండటంతో బసప్ప ఫోన్ చేసి బెదిరింపులకు పాల్పడుతున్నాడని చెప్పారు. విరూపాక్షి గెలుపుకోసం ప్రచారం చేస్తుండటంతో దుర్భాషలాడుతున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో విరూపాక్షి సోదరుడు శ్రీరాములు, ముస్లిం నాయకులు సత్తార్‌ఖాన్, రంగస్వామి, కేసరి శ్రీనప్ప, కేసరి కోనేటి, పోతప్ప, వెంకటరాముడు ఉన్నారు.

జోరుగా ఎన్నికల ప్రచారం



సి.బెళగల్‌లో ఎన్నికల ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

సి.బెళగల్: మండల పరిధిలోని గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు ఆదివారం ఎన్నికల ప్రచారం చేశారు. మండల కేంద్రం సి.బెళగల్‌తో పాటు కంబదహాల్, గొల్లలదొడ్డి, క్రిష్ణదొడ్డి, బ్యాతోలి, కొండాపురం, పలుకుదొడ్డి, సంగాల గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు. ఫ్యాను గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు బీవై రామయ్య, ఆదిమూలపు సతీష్‌ను గెలిపించాలని కోరారు. జేసీఎస్ మండల కన్వీనర్ సీబీ తులసిరెడ్డి, జిల్లా మైనార్టీ కార్యదర్శి ఎస్ఎం బాషా, సర్పంచ్ పాండురంగన్న, నాయకులు బాయికాటి మద్దిలేటి, వెంకటేష్, గోపాల్, రామకృష్ణ, కోఆప్షన్ సభ్యుడు ముల్ల హారున్, మద్దిలేటి, లచ్చప్ప, రాఘవరెడ్డి, వెంకటేష్ పాల్గొన్నారు.

జగనన్న పాలనలో ప్రతి కుటుంబానికి సంక్షేమం



ప్రచారం చేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు రంగనాథ్‌గౌడు, పార్టీ నాయకులు

ఓర్వకల్లు: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందాయని జెడ్పీటీసీ సభ్యుడు రంగనాథ్‌గౌడు, ఓర్వకల్లు సర్పంచ్ నాగేశ్వరమ్మ అన్నారు. ఆదివారం మండలంలోని పెండేకంటినగర్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. నీతి, అవినీతికి మధ్య జరుగుతున్న ఈ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు మద్దతివ్వాలని ప్రజలను కోరారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ఇళ్ల పట్టాలను మంజూరు చేసిన ఘనత వైఎస్సార్‌సీపీకే దక్కిందన్నారు. ఫ్యాను గుర్తుకు ఓటు వేసి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు పోచా బ్రహ్మానందరెడ్డి, కాటసాని రాంభూపాల్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. మేలు జరిగి ఉంటేనే ఓటెయ్యండని అభ్యర్థించారు. స్థానిక నాయకులు శంకర్‌రెడ్డి, బసీర్‌మియా, కృష్ణఫర్, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.